కల్లకల్లోలాలు ★ 'శేషు'

హృదయ స్పందనం ఆగింది. రక్త ప్రసరణం నిలచింది. కళ్లు చీకట్లు కమ్మాయి. అవయవాలు పట్లు తప్పాయి. చమట చిమ్మింది. అలసట వచ్చింది. ఏవేవో మెదడులో మరల తిరుగుతున్నాయి కొన్ని—ఆగిపోతున్నాయి కొన్ని. అంత అవస్థ ఎంత ప్రమాదిస్తే మానవునిలో ప్రత్యక్షమౌతుందో అతనికే తెల్సు. ఆ తెల్సుకొనే శక్తి శూన్యిస్తోంది. ఇంత ప్రళయానికి హేతుభూతం పుటలు తిప్పుతుంటే కళ్లకగుపించిన ఒక్క ఉత్తరం. చిరునామా రాయబడింది కాని బిళ్లమీద మాత్రం ముద్రలేదు. ముద్రేఉంటే ఆమెదడుకంత మతి చెడిఉండేది కాదు. ఈ సంగతి వారిద్దరి స్నేహంలో ఏమార్పుల్ని కల్పిస్తుందో—పరిస్థితుల్ని ఎంత తలకిందు చేస్తుందో, వారి కలయిక చాల చిరకాలానిది కాకపోయినా పురాతనమైందిగా కనుపిస్తుంది. దానికి ఓ రూపాన్ని నిర్ణయించడం తేలిక కాదు. అవి భక్తి-శ్రద్ధలు కావు; వాత్సల్య, వ్యాపారికాలు కావు. ఉత్తరాన్ని వెంటనే పోస్టు చేశానంటే యితన్ని అతడు చేయగలిగిందీ లేదు—చేసేదీ లేదు. ఆమాట యితను చెప్పడు. ఇతన్ని అతను నమ్మకపోడు. వారి సంబంధాలు యిలాగే ఉంటాయి. అతని ద్రవ్యస్థితిమీద యీతనిది పైనే అయినా యీతన్ని, యీతని సలహాల్ని అతడు పాటించకపోయినా చిరునవ్వుల్తోనే దినాల్ని దొర్లిస్తూ ఉంటాడు. ఉత్తరం పుచ్చుకున్న సుందరానికి రాజుస్థితి బుర్రలో తిరుగుతోంది.

ఆరాజు గదిలో రవివర్మ లక్ష్మికి బూజుపట్టింది ఎదురునున్న గడియారం ఎప్పుడు ఆగిపోయిందో తెలియదు. పుస్తకాలు దుమ్ముకింద ఉన్నాయి. కలంలో సిరా ఎండిపోయింది. వాతావరణం అంతా అతని రాజ్యవిచ్ఛిన్నాన్నే కళ్లకట్టుతోంది. అప్పుడప్పుడు ఆ నామకరణం చెయ్యకపోయినా కొంత తిండి దొరికి ఉండేదేమో ననుకుంటూ ఉండేవాడు. ఉపవాసాలకి అతడు అలవాటు పడిపోయాడు. అతని ఆశయాలు, ఆదర్శాలు క్రిందిస్థాయిలో ఉంటే ఇంత అధోగతి పాలుపడే అవసరం లేకపోయేదేమో. కవితా ప్రవాహస్పృహ తగిలినప్పుడే అనుమానించాడు. తను తిండికీ, గుడ్డకే దూరమై పోతున్నాడని. కడుపు నింపుకునీ, వళ్లు కప్పుకునీ యోగ్యతఉంటే సరస్వతీ కటాక్షం అంత తేలిగా తనపై కురకదని అతనికి తెల్సినా అతడు అరికట్టే సమర్థుడుకా లేకపోయాడు. అతని కవిత్వ మధురత్వాన్ని ఆస్వాదించే వారేగాని అతన్ని సత్కరించేవారు మాత్రం లేకపోయారు.

లోకంలో అందరిలా తక్కువ పెట్టుబడితో హెచ్చు డబ్బు సంపాదించే సూత్రం కోసం అన్వేషిస్తున్నా అతని ఆదర్శ వ్యతిరేకంగా ఉండడంవల్ల అతని అన్వేషణ అనంతమై పోయింది. అతని కళ్లముందు ఎందరో సామాన్యులు అసామాన్యులై—ధనికులు మహాధనికులై పోయారు. ఆమర్మాలన్నీ తెలిసే యీతడు ఆపంథాలో పురోగమించడు. అది అతని ఆశయ విరుద్ధం. ఆశయవిరుద్ధం, ఆదర్శ వ్యతిరిక్తం అనుకుంటూ కడుపు కాల్చుకుంటూ చందామీదే బ్రతుకు తెల్లవార్చుకోవలసి వస్తుందేమోనని అనుమానించి కూడా యీ చందా జీవితాన్నే కోరుకుంటున్నాడు గాని దారి మారడంలేదు.

సామాన్య సంసారైనా సుందరమే యీతన్ని తరచు భరిస్తూ ఉంటాడు. ఈ అవకాశాన్ని పురస్కరించుకొని రాజు స్వతంత్రతనిగాని, వ్యక్తిత్వాన్నిగాని చుల్కన చేయడు. రాజు చాల తరచుగా యీతన్ని గురించి ఆలోచిస్తూ ఉంటాడు. అతనికి ప్రతిఫలాన్ని ఏరూపంలో సమర్పించాలో తెలియక చాల సమయాల్లో వ్యథ చెందిన రాజుని ఊరట చెందించేందుకు సుందరం కొన్ని కొన్ని సమయాల్లో తబ్బిబ్బయ్యేవాడు. ఒక్క "క్రాస్‌వర్డు పజిల్సు" పూర్తిచేయడంలో మాత్రం రాజు సహకారాన్ని పొందేవాడు సుందరం. ఇదికూడ వ్యాపారిక దృష్టితో కాదు. క్రమ క్రమంగా వీరిద్దరూ కృషి చేస్తూండేవారు. ప్రతి పజిలుకూ చాల సన్నిహితంగానే సూచనలు సూచిస్తూండేవాడు రాజు. కాని ఏనాడూ కూపను మాత్రం పంపలేదు—యిద్దర్లో ఒకడు కూడ. దీనికి కారణం వారికృషి పరిపక్వం కాలేదనే అనుమానమే. నాలుగైదు తప్పులు తప్పకుండా వచ్చేవి. ప్రతి "సొల్యూషను" తప్పని సరిగా చూచేవారు. ఫలితానికి సామీప్యులు కావడం, ఫలితం అందుకోబోయే సూచన్లు కనుపించడం వీరిద్దర్లో ఆశాకిరణాలు పొడచూపుతున్నాయి. ఆశకి ఆధారం దొరికింది. ప్రోత్సాహం బలవత్తరం అయింది. రాజు ఎలా జేర్చాడో ఒకరూపాయి జేర్చి ఆసారి పజిలు పూర్తిజేసి పోస్టుజెయ్య వలసిందిగా సుందరానికిచ్చాడు. ముగింపు తేదీ గడిచిన మూడురోజుల తరవాత ఉత్తరాన్ని పుస్తకంలో చూచాడు సుందరం. అతనిలో చైతన్య రహితం చేసిందా ఉత్తరమే.

ప్రతి పర్యాయంలా యీసారీ నాలుగైదు తప్పులుంటే సుందరం-రాజు స్నేహితం ఎగుడు దిగుడు లేకుండా సఖ్యంగానే సాగిపోతుంది. ఇది తప్పితే తప్పకుండా కొంత కలవరమే తీసుకొస్తుంది.

అయినా కొంతసేపు ఆలోచించాడు. ఈమాత్రం విషయానికి రాజు నొచ్చుకుని తన్ని సామాన్య మానవుళ్లా నానామాటలూ అంటాడా అని. నమ్మకం తోచక పోయినా అనుమానం హెచ్చయింది. దీనికే మొదటి బహుమతీ వచ్చినట్లు ప్రకటించ బడితే తను రాజుకు చెప్పవలసిన సమాధానం ఏమిటి? ఇదే తోచడం లేదు. కొద్ది మార్పుల్తో తను పంపినదానికి బహుమతి వస్తే దాన్ని రాజుకిచ్చేద్దామని నిర్ణయించు కున్నాడు. కాని ప్రథమ బహుమతి వచ్చిన సొల్యూషను తను పంపిన సొల్యూషను సరిజూచుకుని తన్ను ప్రశ్నిస్తే తను చెప్పగలిగిన జవాబులేనే లేదు. ఏది ఏమైనా ఫలితాలు ప్రకటింప బడేంతవరకూ వెల్లడి చెయ్యదల్చుకోలేదు.

రాజూ సుందరాలు కలుసుకొంటూ నేఉన్నారు. రాజు ఫలితాలకోసం నిరీక్షించడం లేదు. సుందరం మాత్రం వికసితంగా ఉండడం లేదు, రోజులు దగ్గరకు వస్తుంటే కల్లోలం ఎక్కువై పోతోంది-చెప్ప దగ్గ సమాధానం తోచడంలేదు. పరిస్థితులు విషమిస్తాయో, స్నేహం భేద్యమే ఔతుందోనని నిరీక్షణ నిర్జీతక్షణాలు చేర్తోంది. సుందరం మనోవైకల్యాన్ని రాజుకు అభేద్యంగానే ఉంచగల్గుతున్నాడు.

అనుకోకుండానే "ప్రయిజులిష్టు" నింపుకొని కవరు వచ్చింది. సుందరం తనకింత సంపద సంక్రమిస్తుందని ఆశించనైనా ఆశించలేదు. అతని ఆనందం మహదానంద మైంది. అతడుకూడ ధనిక వర్గంలో చేర్చబడి పోతాడు. సుందరం సుందర భవంతుల్లో, సిల్కు దుస్తుల్లో, రంగు రంగుల కారుల్లో, బూజు పట్టిన బుర్రల్లో, ద్రవ్యాడంబర జీవితాల్లో, మిగత జీవితాన్ని దొర్లించాలి. రు 20,000 తన అధీనమై పోతాయి. ఇంటినిండా వెండి బంగారు సామగ్రులు, సోఫాలు, రేడియో, చిత్ర విచిత్ర చిత్రాలు, వింత వింత విగ్రహాలు, టీసెట్లు, ఏపిల్సు, బిస్కట్లు, సప్లయర్సు, కనుపాపల్లో దొర్లిపోతున్నాయి.

కొంత సేపటికిగాని సంతోషంలోంచి తేరుకోలేక పోయాడు. జాపితా చదివే అవకాశాన్ని ఇప్పటికి వినియోగించు కుంటున్నాడు. తప్పలేని సొల్యూషను రానందున ఒకతప్పుతో వచ్చిన యీతని సొల్యూషనుకు రెండవ బహుమతి ప్రకటింప బడింది. దీనిమూలం అంతా రాజేననే ఎప్పుడు సుందరం తలుస్తూనే ఉంటాడు. రాజు సొల్యూషను'కీ సొల్యూషను'తో సరిజూడాలనే కుతూహలంతో దాన్ని పుస్తకం నుంచి తీసిచూచాడు.

పదం పదం పరవశం కల్గించింది; సీల్డు సొల్యూషనుతో సరిపోయింది. ఇది చేరిఉంటే రాజు అంత దురదృష్టవంతుడే కాకపోయేవాడు. సుందరం సంతోష ప్రవాహం అంతటితో ఆగిపోయింది. రాజుకు తనకు మధ్య భవిష్యాన్ని ఆలోచిస్తూ రాజు పజిల్ని ఎప్పటిచోటే చేర్చాడు.

రాజు వస్తూనే "సాధించావోయ్ సుందరం. కష్టం ఫలించిం" దంటూ ఆనందం వెలిబుచ్చాడు. ఉత్సాహంగా ఉండవల్సిన సమయంలో దిగాలు పడుతున్న సుందరాన్నర్థం చేసుకోవడం కోసం ప్రయత్నిస్తున్నాడు రాజు. తన స్నేహితుడికి రెండో బహుమతి వచ్చిందని చూడ్డంతోనే తను సంతోషాన్ని పట్టలేక పోయాడే అతనిలో విప్లవం ఏమాత్రం కనిపించదేమా ననే ఆతడు ఆలోచిస్తునాడు.

రాజు జుట్టు గాలిలో రేగుతోంది. సుందరం గదిలో బొమ్మల కేలండర్లు ఊగులాడు తున్నాయి. మంచంమీద దుప్పటీ లేచిపోయింది, బల్లమీద పుస్తకాల కాగితాలు ఓపక్క నుంచి మరో ప్రక్కకి విసురుగా లేచిపోయాయి. పుస్తకంలో పొందుపరచిన కాపన్లు ఎగిరి కిందపడ్డాయి. రాజు దృష్టిలోనూ పడ్డాయి సుందరం సమస్య విచ్చిపోయింది. స్నేహితం తుదిఘడియల్లో పడింది. రాజు సందర్శనాలూ, మధుర సంభాషణలూ ముగుస్తాయి. సుందరం గుండెల్లో రక్తపు పొంగుల్ని కూడా గాలి రెచ్చగొడుతోంది. పరిస్థితుల్ని పట్ట శక్యం కావడంలేదు.

"ఇవి యిక్కడే ఉండిపోయాయా?" అంటూ సహజంగా లేచాడు.

అనుకున్నంత కల్లోలం. కోప ప్రవాహాలు సుందరానికేం కనుపించలేదు. ఇంత తేలిగ్గా తనతప్పు తుడుచుకు పోతుందను కోలేదు. రాజునోట వచ్చిన మొదటి ఉచ్చారణతోనే భావి నూహించాడు సుందరం.

సామాన్య పరిస్థితుల్లోకి వస్తూనే - "దీన్ని గురించి నేను ఎంతో దిగాలు పడుతున్నా".

"ఎందుకింత వ్యాకపడ్డం. అందుకే యింతవరకూ పూర్వపు సుందరంలా కనుపించడం లేదు. కారణం కోసం .వెదుకుతే దొరకలేదు."

అంగులో ఒక 'కాపను' 'ఆల్ కరక్టుతో సరిపోయింది' దీన్ని చెపుతూ కొంత అనుమానించాడు. ఇప్పుడైనా కొంతకోపం వస్తుందేమోనని. మార్పులూ లేవు-రంగులూ మారడం లేదు.

"పోనీ! సరిపోతే. నీకు బహుమతి వచ్చిందిగా చాలు" "ఇరవై వేలల్లో సగం నీకు" అన్నాడు నవ్వు తెచ్చుకుంటూ.

"ఉహూ—"

సుందరం రాజు ముఖంలోకే చూస్తున్నాడు.

"నాకెందుకు? అది నీది. అంటూ చందా బ్రతుకునే కోరు కున్నాడు రాజు.

కల్ల కల్లోలాల్ని కళ్లల్లోకి తెచ్చుకుంటూ శూన్యంలోకి చూస్తున్నాడు సుందరం.